క్లుప్తంగా

15న మండలాభిషేకం



జనార్ధనస్వామి దేవస్థానం

దుత్తలూరు : మండలంలోని నర్రవాడలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధనస్వామి మండలాభిషేకం ఈనెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మాదాల ఎస్.బాబూరావు మంగళవారం తెలిపారు. ఆలయ జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ ఉత్సవాలు జరిగి 40 రోజులు పూర్తవుతున్న సందర్భంగా మండలాభిషేకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 8 గంటలకు విశ్వక్సేన పూజ, నవకలశ ఆరాధన, స్వామివారికి అభిషేకం, వేద పవన హోమం, పూర్ణాహుతి నివేదన, సాయంత్రం 5 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం పల్లకి ఉత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



సంగం : మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ ఇళ్లను సందర్శించి నిర్మాణాల నాణ్యతను హౌసింగ్ ఈఈ మోహన్‌రావు, ఇన్‌చార్జి డీఈ గౌస్ మోహిద్దీన్‌లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు ముందుకొచ్చి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ భార్గవి

సీతారామపురం : గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని, అప్పుడే స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని ఈఓపీఆర్డీ భార్గవి అన్నారు. సీతారామపురంలోని పలు వీధుల్లో ఆమె మంగళవారం పర్యటించి పారిశుధ్యం మెరుగుపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా తప్పదన్నారు. అనంతరం తడి, పొడి చెత్త సేకరణ గురించి వివరించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి రామనాథ్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, హరిత రాయబారులు పాల్గొన్నారు.

పలువురికి ఆశీర్వాదం



కావలి : పట్టణంలోని ఉదయగిరి శ్రీనివాసులు కుమారుడి గంధపు నలుగు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు హాజరై ఆశీర్వదించారు. అలాగే పట్టణంలోని ఈగలపాటి సుభాషిణి కుమారుడు వెంకట రామ్‌సాయికుమార్ గంధపు నలుగు కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

పనిభారం తగ్గించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు


వింజమూరు(ఉదయగిరి) : గ్రామస్థాయి పాలనలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు వివిధ సర్వేల పేరుతో పనిభారం మోపడాన్ని తగ్గించాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో అనేక రకాల పనులు పంచాయతీ కార్యదర్శులకు ఉందని, దీనికితోడు ప్రస్తుత ప్రభుత్వం నిర్వహిస్తున్న పలు సర్వేల భారం మోపడంతో మానసిక ఒత్తిడికిలోనై ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. గ్రామ సచివాలయాల్లో పనిచేసే వివిధ శాఖల ఉద్యోగులతో సర్వే చేయించాలని, గత ప్రభుత్వంలో ఉన్న వలంటీర్ల వ్యవస్థలకు సమాంతర వ్యవస్థ తీసుకొచ్చి సర్వేలను వారితో చేయించాలని కోరారు.

పేదల చదువుపై కక్ష

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనను నీరుగార్చిన కూటమి ప్రభుత్వం

- ఆందోళనలో విద్యార్థులు
- వారి తరఫున వైఎస్సార్‌సీపీ యువత పోరు నేడు

పేద పిల్లలపై కూటమి ప్రభుత్వం కక్షగట్టింది. వారి ఉన్నత చదువుల ఆశలపై నీరుకొడుతోంది. గత ప్రభుత్వంలో నిర్విఘ్నంగా కొనసాగుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా, వసతిదీవెనను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయడంతో ఆత్మకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో చదివే లక్షలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. భారీ మొత్తంలో ఫీజులు ఎలా చెల్లించాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ 'యువత పోరు' పేరిట బుధవారం శాంతియుత నిరసనకు శ్రీకారం చుట్టింది.



ఆత్మకూరు : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద పిల్లల ఉన్నత చదువులు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగింది. విద్యార్థులు నిర్భయంగా చదువును కొనసాగించేవారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన ఇస్తుండడంతో తల్లిదండ్రులపై భారం లేకుండా ఉండేది. విద్యార్థులు కూడా ఫీజుల బెడద లేకుండా ఉన్నత చదువులు పూర్తి చేసేవారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర చదువులను ఉత్సాహంగా పూర్తి చేసి ఉద్యోగాల కోసం వెళ్లే పరిస్థితి ఉండేది.

అటకెక్కిన ఫీజు రీయింబర్స్‌మెంట్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అటకెక్కించింది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కోసం కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజుల కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ కట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో విద్యార్థులు సైతం తల్లిదండ్రుల కష్టాలు చూసి ప్రశాంతంగా చదువును కొనసాగించలేని పరిస్థితి నెలకొన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు కోసం సుమారు రూ.4,500 కోట్లకుపైగానే ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఓ వైపు విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదు విడుదల చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ పలుమార్లు ప్రభుత్వానికి గుర్తు చేసినా స్పందన లేకుండా ఉంది. తప్పని పరిస్థితుల్లో యువత పోరును పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా కళాశాలల విద్యార్థులు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతుండడం విశేషం.

నియోజకవర్గ పరిధిలో..

ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఒక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల, ఎనిమిది ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు, 4 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూసే కళాశాలల విద్యార్థులు సుమారు 9 వేల మందికిపైగానే ఉన్నారు.

చదువులకు విఘాతమే



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు తొమ్మిది నెలలు కావస్తోంది. అయినా ప్రకటించిన పథకాలను అమలు చేయలేదు. ముఖ్యమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు కాకపోవడంతో చదువులకు విఘాతమే. ప్రభుత్వం సహృదయంతో స్పందించి వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి.

– కత్తి సింహాద్రి, ఇంజినీరింగ్ విద్యార్థి, తిక్కవరం

గండిపాళెం గురుకులంలో విచారణ

ఉదయగిరి : మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో ఆత్మకూరు బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ కామేశ్వరి మంగళవారం రాత్రి విచారణ చేశారు. ఇటీవల ఇక్కడ విద్యార్థులతో వంట పనులు చేయించినట్లు ప్రచార మాధ్యమాల్లో వెలుగులోకొచ్చిన నేపథ్యంలో పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు, వంట సిబ్బందితో విడివిడిగా మాట్లాడారు. అక్కడున్న వాస్తవ పరిస్థితులను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపుతామని ఆమె తెలిపారు.

మామిడిలో సస్యరక్షణ అవసరం



మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానాధికారి

ఆత్మకూరురూరల్ : మండలంలో పెన్నానది ఒడ్డున విస్తారంగా ఉన్న మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు అవసరమని ఉద్యాన శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గ్రామంలోని మామిడి తోటలను స్థానిక రైతులు, అధికారులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల వల్ల నల్లతామర పురుగులు ఉధృతి ఉందన్నారు. దీని నివారణ చర్యలను వివరించారు.

'యువత పోరు'కు తరలిరండి



వింజమూరులో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కలిగిరిలో..

వింజమూరు(ఉదయగిరి) : నెల్లూరు కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగే యువత పోరుకు మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతలు తరలిరావాలని పార్టీ మండలాధ్యక్షుడు రేవునూరు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. ఆయన వింజమూరులో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, దీనికి నిరసనగా జరిగే యువత పోరుకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. అలాగే పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కూడా గ్రామాల్లో జరపాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లాల కొండారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి గణపం రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు డేగా వంశీ, స్థానిక నేతలు మద్దూరు చిన్నికృష్ణారెడ్డి, మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, సూరం వినోద్, కాటం రమణారెడ్డి, డి.విజయకృష్ణారెడ్డి, పల్లాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల మెడలు వంచుదాం

జలదంకి : నెల్లూరులో చేపట్టే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేసి కూటమి నేతల మెడలు వంచుదామని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. జలదంకిలో వారు యువత పోరు పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థులు, యువతను నిలువునా మోసగించిన కూటమి ప్రభుత్వంపై శాంతియుతంగా వైఎస్సార్‌సీపీ యువత పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురె వెంకటశేషారెడ్డి, కోర్నిపాటి రామిరెడ్డి, రామాల రమేష్‌రెడ్డి, దేవరపల్లి మధుసూదన్‌రెడ్డి, పులివెందుల రామయ్య, ఒంగోలు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



జలదంకిలో..

విజయవంతం చేయండి

కలిగిరి : కలిగిరిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో 'యువత పోరు' కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పోరు కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాలూరు కొండారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాధాకృష్ణారెడ్డి, హజరత్‌రెడ్డి, మనోహర్, మోహన్, శ్రీనివాసులు, ఖాజామొయినుద్దీన్, వేమనారాయణ, రవి, మాల్యాద్రి, అంకిరెడ్డి, బాలకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, తిరుపాలు, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామావతారంలో ప్రసన్నుడు



రామావతారంలో హనుమంత వాహనంపై కొలువుదీరిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి

బిట్రగుంట : కొండబిట్రగుంట బిలకూటక్షేత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రసన్న వెంకటేశ్వర స్వామి రామావతారంలో మంగళవారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవ కళతో ప్రసన్నంగా ఉన్న స్వామివారు రామావతారంలో హనుమంత వాహనంపై ఆలయ ముఖమండపంలో కొలువుదీరి భక్తులకు అభయం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక బృందం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సూక్ష్మబుద్ధి, అసమాన ఏకాగ్రత, అపరిమిత బలం, ప్రచండ వాయివేగం కలిగిన హనుమంతునిపై కొలువుదీరిన స్వామివారు అడుగడుగునా భక్తుల కర్పూర నీరాజనాలందుకుంటూ అర్ధరాత్రి దాటిన తరువాత ఊరేగారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం త్పూర్వం అర్చక బృందం సుప్రభాత సేవలతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్య పూజలు నిర్వహించారు.

నేత్రపర్వంగా పూలంగిసేవ

అలంకార ప్రియుడైన స్వామివారు పూలంగిసేవలో మరింతగా శోభిస్తూ భక్తులకు కనువిందు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే పూలంగిసేవను వివిధ రకాల పుష్పాలు, తులసీ మాలలతో అర్చకులు నేత్రపర్వంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మోహిని ఉత్సవం, సాయంత్రం పూలంగి సేవ, రాత్రికి గరుడ వాహనసేవను నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

దేవుడిలా వచ్చి.. ప్రాణాలను రక్షించి..

- ఆటోలో పేలిన బాణసంచా
- చిన్నారిని కాపాడిన గుర్తుతెలియని వ్యక్తి
- బ్రహ్మోత్సవాల్లో చోటుచేసుకున్న అపశ్రుతి



బాణసంచా పేలుళ్లతో దగ్ధమవుతున్న ఆటో

బిట్రగుంట : కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో మంగళవారం రాత్రి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదవశాత్తు బాణసంచా తరలిస్తున్న ఆటోలో మంటలు చెలరేగగా సమీపంలోనే ఉన్న భక్తులు వెంటనే అక్కడి నుంచి బయటపడగా ఓ చిన్నారి మంటలకు దగ్గర పడిపోయారు. అయితే గుర్తుతెలియని వ్యక్తి దేవుడిలా వచ్చి చిన్నారిని కాపాడారు. భక్తుల కథనం మేరకు.. రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో కొండపైనుంచి ప్రసన్న వెంకటేశ్వరస్వామి హనుమంత వాహనంపై గ్రామోత్సవానికి బయలుదేరారు. అదే సమయంలో కొండ దిగువన మెట్ల మార్గం వద్ద బాణసంచా కాలుస్తుండగా ప్రమాదవశాత్తు అవి పక్కనే బాణసంచాతో ఉన్న ఆటోలో పడ్డాయి. దీంతో ఆటోలో ఒక్కసారిగా మంటలు చెలరేగి పెద్ద శబ్దంతో టపాసులు పేలాయి. వెంటనే ఆటో వద్ద నుంచి భక్తులు పరుగులు తీసి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అయితే ఆటో సమీపంలోనే ఒక చిన్నారి పడిపోగా గుర్తుతెలియని వ్యక్తి దేవుడిలా వచ్చి చిన్నారిని పక్కకు తీసుకువెళ్లి ప్రాణాలు కాపాడాడు. ఆటో డ్రైవర్ మాత్రం స్వల్పంగా గాయపడ్డాడు. కాగా ఆటోలో 30 నిమిషాలకు పైగా మంటలు చెలరేగాయి. అయినా మంటలను అదుపు చేసేందుకు ఫైరింజన్ మాత్రం రాలేదు. కొండ దిగువన విద్యుత్ సరఫరాను నిలిపివేసి భక్తులే బకెట్లతో నీటిని తెచ్చి మంటలను అదుపు చేయాల్సి వచ్చింది.



ఆటో పక్కన పడిపోయిన చిన్నారిని కాపాడుతున్న వ్యక్తి

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

ఉదయగిరి : మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ-పడాయిబీపై శిక్షణ తరగతులను స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. రిసోర్సు పర్సన్లు ఆర్.సుబ్బరత్నమ్మ, సీహెచ్ రమణమ్మ పాల్గొని, మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యాబుద్ధులు నేర్పాలన్నారు.

- వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. సూపర్‌వైజర్లు తేజస్విని, నాగేశ్వరి పలు సూచనలు చేశారు.
- **చేజర్ల :** మండలంలోని ఆదురుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సురేఖ, రమాదేవి పాల్గొని, పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం జీవీ రమేష్ పాల్గొన్నారు.
- **వింజమూరు(ఉదయగిరి) :** అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన పెంచాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పద్మజాకుమారి పేర్కొన్నారు. వింజమూరులో మంగళవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని, పలు సూచనలు చేశారు.
- **సీతారామపురం :** స్థానిక జెడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇన్‌చార్జి సీడీపీఓ సునీత మాట్లాడుతూ చిన్నారులకు పోషకాహార లోపం లేకుండా పూర్వ ప్రాథమిక విద్యనందించటమే శిక్షణా తరగతుల ప్రధాన ఉద్దేశమన్నారు.

17న మహాధర్నా

ఉదయగిరి : పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏపీ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈనెల 17న విజయవాడలో మహాధర్నాను చేపడుతున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడు జి.నాగేశ్వరరావు, కేపీ పెంచలనర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్‌లో పంచాయతీ కార్మికుల ఆశలను నీరు గార్చిందన్నారు. జిల్లా నుంచి పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

కూటమి పాలన మోసాలమయం

ఆత్మకూరురూరల్ : పది నెలల కూటమి పాలన మోసాలమయంగా సాగిందని సీపీఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్‌రాజు అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో కార్యకర్తలతో కలిసి ప్రజాచైతన్య యాత్రను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఐద్వా నేతలు గుల్జార్‌బేగం, వినుకొండ పద్మ, రమణయ్య, సుమతి, పోలయ్య పాల్గొన్నారు.

జొన్న పంట పరిశీలన

సీతారామపురం : మండలంలోని బాలాయపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో మొక్కజొన్న పంటను ఏఓ చెన్నారెడ్డి మంగళవారం పరిశీలించారు. పంటలో పేనుబంక, పొగాకు లద్దెపురుగు ఆశించినట్లు గుర్తించి, నివారణ చర్యలను సూచించారు. వీఏఏలు స్వప్న, నరేంద్ర పాల్గొన్నారు.

- **మర్రిపాడు :** మండలంలోని కంపసముద్రం గ్రామంలో ఉన్న జొన్నపంటలో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్ర దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ లలిత శివజ్యోతి, శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. వీఏఏ శ్రావణి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు

చేజర్ల : ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. చేజర్లలోని రైతు సేవా కేంద్రంలో రైతులు, అధికారులతో ఆమె మంగళవారం మాట్లాడారు. మండలంలో 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటి ద్వారా రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తే ట్రాన్స్‌పోర్టు చార్జీలు, గన్నీ బ్యాగ్స్‌ను అధికారులు సమకూరుస్తారన్నారు. అనంతరం గొల్లపల్లిలో ధాన్యాన్ని లారీలకు తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. రైతులకు ట్రక్ షీట్స్‌ను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళి, వెలుగు ఏపీఎం సృజన, నాయకులు ఉన్నారు.

- **సోమశిల :** అనంతసాగరం మండలం పరిధిలోని పాతదేవరాయపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పాతదేవరాయపల్లి గ్రామానికి ఏడీఏ దేవసేనమ్మ హాజరై మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా తేమ శాతాన్ని బట్టి కొంటున్నట్లు తెలిపారు. ఏఓ శ్రీధర్‌రెడ్డి, వీఏఏలు బాషా, దివ్య, శివారెడ్డి పాల్గొన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి తొలగింపు

బిట్రగుంట : బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో వినియోగంలో లేని పాత ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని రైల్వే అధికారులు మంగళవారం తొలగించారు. రైల్వేస్టేషన్ల ఆధునికీకరణలో భాగంగా కొత్త ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చిన తరువాత పాత బ్రిడ్జి నిరుపయోగంగా మారింది. దీంతో రైల్వే అధికారులు భారీ క్రేన్‌ల సాయంతో వంతెనను తొలగించారు. ఉదయం 10.40 నుంచి మధ్యాహ్నం 12.40 గంటల వరకూ, తరువాత 3.20 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకూ రెండు విడతలుగా లైన్‌బ్లాక్ తీసుకుని అధికారులు పాత వంతెనను తీసివేశారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

కావలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఉచిత రక్త నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం తలసేమియా వ్యాధిపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ వైద్యాధికారిణి రమ్య మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే రక్తంలోని గ్రూపులు, రక్తహీనత, సాంక్రమిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తలసేమియా సెంటర్ కన్వీనర్ హరినారపరెడ్డి, జేవీవీ కార్యదర్శి హరినాథ్, పాల్గొన్నారు.

పన్నులను సకాలంలో చెల్లించండి

ఆత్మకూరు : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఇంటి, కొళాయి, ఖాళీ స్థలాల పన్నుల బకాయిలను వెంటనే చెల్లించాలని కమిషనర్ గంగాప్రసాద్ కోరారు. ఆయన తన కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. ఈనెలాఖరు నాటికి నూరు శాతం పన్నులను వసూలు చేసేలా సిబ్బంది పనిచేయాలన్నారు. ఇంటింటికీ తిరిగి పన్నులు చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో చోరీ



వరికుంటపాడు : మండలంలోని పామూరుపల్లి గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామ సమీపంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో రోజులాగే అర్చకులు సోమవారం రాత్రి పూజలు ముగించుకుని గుడికి తాళాలు వేసి వెళ్లారు. మంగళవారం ఉదయం వెళ్లిన అర్చకులు గేటు తాళం, హుండీ పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. హుండీలోని నగదును చోరీ చేసినట్లు గుర్తించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై రఘునాథ్ తెలిపారు.

గ్లకోమాపై అవగాహన



ఆత్మకూరు : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గ్లకోమా(నీటికాసులు) వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కళ్ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా అంధత్వ నివారణాధికారిణి శార్వాణి వివరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ శేషారత్నం, ఆర్‌ఎంఓ డాక్టర్ ఉషాసుందరి పాల్గొన్నారు.

జిల్లాకు చంద్రబాబు చేసిందేమీ లేదు

కావలి : సీఎంగా 15 ఏళ్లు పనిచేసిన చంద్రబాబు నెల్లూరు జిల్లాకు చేసిందేమీ లేదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. కావలిలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. నెల్లూరు, కావలి అభివృద్ధికి రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంట్లో ఎంత మంది మహిళలుంటే అందరికీ నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయని, అదే విధంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం ఎప్పుడు చేస్తారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, కేవలం అమరావతికే అభివృద్ధి పరిమితం కాకూడదన్నారు. మద్యం అమ్మకాలతో వచ్చిన డబ్బుతో వివాహాలకు సైతం సీఎం చంద్రబాబు ప్రత్యేక విమానాల్లో తిరుగుతున్నాడని విమర్శించారు. 2027లో జమిలీ ఎన్నికలు రాబోతున్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు శివ, వెంకయ్య, అంకయ్య పాల్గొన్నారు.